
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

గురువారం 1 ఆగస్టు 2024



ప్రతీ నెల ఉద్యోగుల సమస్యల పరిష్కార వేదిక

పాడేరురూరల్, జూలై 31: ఈ నెల నుంచి ప్రతీ నెల మూడవ శుక్రవారం ఉద్యోగుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని శాఖల ప్రధాన అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతీ నెల మూడవ శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తామన్నారు. ఇది వరకు ప్రకటించినట్టు నాల్గవ శుక్రవారానికి బదులుగా మూడవ శుక్రవారానికి మార్పు చేసినట్టు పేర్కొన్నారు.

నేడు వయనాడ్, నాడు కోడిపుంజువలస..

పద్దెనిమిదేళ్ల క్రితం గిరిజన గ్రామంపై విరుచుకుపడిన కొండచరియలు

- బురదతో కూడిన వరద ముంచెత్తడంతో 19 మంది సజీవ సమాధి
- పదుల సంఖ్యలో గాయాలపాలు
- భారీగా మూగజీవాలు మృత్యువాత
- ఇళ్లు నేలమట్టం
- హుద్‌హుద్ తుఫాన్‌కు మేదరశాల గ్రామంపైకి కొండచరియలు రావడంతో ఆరుగురు మృతి
- నాటి ఘటనలను జ్ఞప్తికి తెచ్చుకుంటున్న గిరిజనులు



కోడిపుంజువలస గ్రామంపైకి వరదలా వచ్చిన బురద (ఫైల్)



తల్లీ, బిడ్డ మృతదేహాలు (ఫైల్ ఫొటో)

అరకులోయ, జూలై 31: **కేరళలోని వయనాడ్‌లో బురదతో కూడిన వరద ముంచెత్తడంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. సోమవారం అర్ధరాత్రి సరిగ్గా 1.30 సమయంలో వరద బీభత్సానికి కొండ చరియలు విరిగిపడ్డాయి. ముండక్కై గ్రామాన్ని తుడిచిపెట్టేశాయి. ఆ గ్రామంలో నివసిస్తున్న వందల మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. సరిగ్గా...ఇటువంటి ఘటనే పద్దెనిమిదేళ్ల క్రితం నాటి విశాఖపట్నం జిల్లా, నేటి అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం శిరగాం పంచాయతీ కోడిపుంజువలస గ్రామంలో చోటుచేసుకుంది. 2006 ఆగస్టు 3వ తేదీ రాత్రి సమీపంలో గల కొండచరియలు, బురదతో కూడిన వరద గ్రామాన్ని ముంచెత్తాయి. ఈ ఘటనలో 19 మంది సజీవ సమాధి కాగా, పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు. నాటి ఘటనను ఈ ప్రాంతవాసులు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు.**

అరకులోయ మండలం కోడిపుంజువలస గ్రామం...2006 ఆగస్టు 3వ తేదీ అర్ధరాత్రి అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా కొండచరియలు విరుచుకుపడ్డాయి. వాయుగుండం ప్రభావంతో అప్పటికి అరకులోయ పరిసరాల్లో నాలుగు రోజులుగా భారీవర్షాలు కురుస్తుండడంతో వరద బురద రూపంలో పోటెత్తింది. దీంతో 19 మంది సజీవ సమాధి అయ్యారు. గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న చొంపికొండ పైనుంచి బండరాళ్లు దొర్లుకుంటూ వచ్చాయి. వరద ఉధృతికి చాలామంది నిద్రలోనే దిగువనున్న గెడ్డలోకి కొట్టుకుపోయారు. మూగజీవాలు కూడా వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. బండరాళ్లు దొర్లుకొస్తున్నా ఈదురుగాలుల వల్ల ఆ శబ్దం తమకు వినిపించలేదని అప్పట్లో బాధితులు తెలిపారు. 70కి పైగా ఇళ్లు నేలమట్టమయ్యాయి. అప్పటి ప్రభుత్వం స్పందించి ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో బాధితులకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేసి వసతులు ... మిగతా 8వ పేజీలో



గ్రామంపైకి వచ్చిన కొండ చరియ (ఫైల్ ఫొటో)



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్. చిత్రంలో డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ అమిత్‌బర్దార్, తదితరులు

గంజాయి సాగుపై ఉక్కుపాదం

- పండించిన రైతులు, వినియోగించే వారిపైనా కఠిన చర్యలు
- కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ హెచ్చరిక

పాడేరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు చేసే రైతులు, వినియోగించే వారిపైనా కఠిన చర్యలు చేపడతామని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో పోలీస్ శాఖ, వ్యవసాయ శాఖ, అటవీ శాఖ, ఉద్యానవన శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, డ్వామా, డీఆర్‌డీఏ అధికారులతో బుధవారం గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం ఏడుగురు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. శాఖాధికారులు మండల స్థాయిలోను, గ్రామ స్థాయిలోను ఇంటర్ డిపార్టుమెంట్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. గంజాయి సాగును నిర్మూలించి గిరిజన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు అందించడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గంజాయి అంటే అందరికీ అల్లూరి సీతారామరాజు జిల్లా గుర్తుకు వస్తోందన్నారు. గంజాయిను సమూలంగా నిర్మూలించి జిల్లాకు మంచి పేరు తీసుకు రావలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రతీ మొదటి శుక్రవారం గ్రామస్థాయిలో, రెండవ శుక్రవారం మండల స్థాయిలో, మూడవ శుక్రవారం జిల్లా స్థాయిలో గంజాయి నిర్మూలనా చర్యలపై సమావేశాలు నిర్వహిస్తామన్నారు. గంజాయి సాగు చేసే భూములను గుర్తించి నివారణ చర్యలు, రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. గంజాయి సాగును విడిచిపెట్టిన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. గిరిజన రైతులకు ఉద్యాన వన పంటలను అందిస్తామన్నారు. గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. మండలాల వారీగా గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలపై పక్కాగా కార్యాచరణ అమలు చేయాలన్నారు. డీఐజీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ 2010 నుంచి 2012 వరకు చింతపల్లి ఏఎస్పీగా విధులు నిర్వహించానని, అప్పట్లో పెద్దగా గంజాయి సమస్య రాలేదన్నారు. ఇప్పుడు పెద్ద సమస్యగా మారి పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు, ఆర్టీసీ కాంప్లెక్సులు, బహిరంగ ప్రదేశాల్లో గంజాయిని వినియోగిస్తున్నారని తెలిపారు. జూన్, జూలై, ఆగస్టు నెలలో విత్తనాలు నాటుతారని, ఆయా ప్రాంతాలను గుర్తించి ఆదిలోనే అంతం చేయాలని సూచించారు. గంజాయి సాగు చేస్తే జరిగే నష్టాలను రైతులకు, యువతకు అవగాహన కల్పించి ఇతర పంటల వైపు మళ్లించాలని చెప్పారు. గత ఏడాది పది వేల ఎకరాల్లో గంజాయిని ధ్వంసం చేసినట్టు చెప్పారు. వలంటీర్లు, సచివాలయం సిబ్బంది, కూంబింగ్ పోలీసులు గంజాయి పంటలను గుర్తించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి గంజాయిని నిర్మూలించాలన్నారు.

ఉద్యాన వన పంటలు, స్ట్రాబెర్రీ, అవకాడో వంటి పంటలను రైతులకు అందించాలని చెప్పారు. గత ఏడాది 3 లక్షల కిలోల గంజాయిని దహనం చేశామని, త్వరలో మరో లక్ష కిలోల గంజాయిని దహనం చేస్తామన్నారు. గంజాయి సాగును అధికారులు చూసీచూడనట్టు వదిలిపెడితే సమాజానికి నష్టం వాటిల్లుతుందన్నారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయి కమిటీలలో పోలీసుల భాగస్వామ్యం ఉండాలన్నారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఒక్కొక్క మండలంలో ఒక్కొక్క ప్రత్యామ్నాయ పంటలను పరిచయం చేయాలని చెప్పారు. గిరిజన యువత ఉపాధి అవకాశాలను వదిలి పెట్టి తిరిగి గ్రామాలకు చేరుకుంటున్నారని, అటువంటి యువతను గుర్తించి స్వయం ఉపాధి పథకాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ ధీరజ్, డీఆర్‌వో బి.పద్మావతి, డీఎఫ్‌వో వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, జిల్లా ఉద్యాన వనాధికారి రమేష్ కుమార్ రావు, టీడబ్ల్యూ డీడీ ఐ.కొండలరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డీఐజీ ఆకస్మిక సందర్శన

ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్ష



ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

పాడేరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి బుధవారం అల్లూరి జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఎస్పీ కార్యాలయాన్ని పరిశీలించిన అనంతరం ఆయన ఎస్పీ అమిత్ బర్దర్, ఏఎస్పీ కె.ధీరజ్, ఎస్‌బీ సీఐ ఎల్.హిమగిరి, డీసీఆర్బీ సీఐ నారాయణరావు, స్థానిక ఎస్‌హెచ్‌వో డి.నవీన్‌కుమార్, సీఐ సన్యాసినాయుడు, ఎన్‌డీపీఎస్ సెల్ ఎస్ఐ దుర్గాప్రసాద్‌లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరిగిన నేరాలు, శాంతి భద్రతల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మావోయిస్టుల నిర్మూళన గురించి, గంజాయి రవాణా జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, మహిళల రక్షణ, రోడ్డు రక్షణకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



డోలీలో రోగిని వాగు దాటించి ధారకొండ ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

తప్పని డోలీ మోత

- రోగిని ఉధృతంగా ప్రవహించే వాగు దాటించి ధారకొండ ఆస్పత్రికి తీసుకువెళ్లిన బంధువులు
- పరిస్థితి విషమంగా ఉండడంతో చింతపల్లికి రిఫర్ చేసిన వైద్యులు
- అంత దూరం తీసుకువెళ్లలేక స్వగ్రామానికి తిరుగుముఖం

సీలేరు, జూలై 31: మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు డోలీ మోతలు తప్పడం లేదు. అత్యవసర వైద్యం కోసం రోగులను ఆస్పత్రికి తరలించాలంటే ప్రాణాలకు తెగించి ఉధృతంగా ప్రవహించే వాగును సైతం దాటాల్సిన పరిస్థితి నెలకొంది. జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధిలోని నిమ్మచెట్టు గ్రామానికి చెందిన ఓ గిరిజనుడిని ఇదే విధంగా అతని బంధువులు బుధవారం ఆస్పత్రికి తరలించారు. రోగి పరిస్థితి విషమంగా ఉండడంతో ధారకొండ ఆస్పత్రి వైద్యులు చింతపల్లి ఆస్పత్రికి రిఫర్ చేయడంతో అక్కడికి తీసుకువెళ్లలేక తిరిగి స్వగ్రామం తీసుకువెళ్లిపోయారు.

జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధిలోని నిమ్మచెట్టు గ్రామానికి చెందిన పాంగి గోవన్న (60) గత వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అయితే ఇటీవల ఈ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు నిమ్మచెట్టు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అతనిని ఆస్పత్రికి తరలించడం కుదరలేదు. అయితే బుధవారం వాగు ఉధృతి కాస్త తగ్గుముఖం పట్టడంతో గోవన్నను ధారకొండ ఆస్పత్రి కి నిమ్మచెట్టు గ్రామంలో ఉన్న చెక్‌డ్యాం పైనుంచి వారి బంధువులు డోలీ మోతతో తీసుకు వెళ్లారు. అప్పటికే అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అక్కడి వైద్యులు చింతపల్లి ఆస్పత్రికి రిఫర్ చేశారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న అతను చింతపల్లిలో చనిపోతే అక్కడ నుంచి తీసుకురాలేమని బంధువులు భావించారు. దీంతో అతనిని తిరిగి నిమ్మచెట్టు గ్రామానికి తీసుకువచ్చి నాటు వైద్యం అందిస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు

- ఓటర్లు 822 మంది
- 36 మంది జడ్పీటీసీ సభ్యులు, 636 మంది ఎంపీటీసీ సభ్యులు,
- 97 మంది జీవీఎంసీ కార్పొరేటర్లు
- నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల్లో 53 మంది కౌన్సిలర్లు
- ఉమ్మడి జిల్లాలో అమలులోకి కోడ్
- కలెక్టర్ల సదస్సుకు హాజరుపై ఈసీకి కలెక్టర్ లేఖ

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు ప్రారంభించింది. ఈ ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, జీవీఎంసీలో కార్పొరేటర్లు, ఎలమంచిలి, నర్సీపట్నం మునిసిపాలిటీల కౌన్సిలర్లు మొత్తం 822 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. జిల్లాలో 39 జడ్పీటీసీ సభ్యులకుగాను ప్రస్తుతం 36 మంది ఉన్నారు. హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అరకులోయ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో జడ్పీటీసీ సభ్యుని పదవికి రాజీనామా చేశారు. సబ్బవరం, రావికమతం జడ్పీటీసీ సభ్యులు తుంపాల అప్పారావు, తలారి రమణమ్మ అనారోగ్య కారణాలతో మృతిచెందారు. మొత్తం మూడు జడ్పీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. కాగా 652 ఎంపీటీసీ స్థానాలకుగాను వివిధ కారణాలతో ప్రస్తుతం 636 మంది, జీవీఎంసీలో 98 కార్పొరేటర్లకుగాను 97 మంది ఉన్నారు. 21వ వార్డు నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికైన వంశీకృష్ణ శ్రీనివాస్ తదనంతరం ఎమ్మెల్సీ కావడంతో కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. ఎలమంచిలి మునిసిపాలిటీలో 25 మంది, నర్సీపట్నం మునిసిపాలిటీలో 28 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇదిలావుండగా ... మిగతా 8వ పేజీలో



సీఐ హడావిడి

నగరంలో పోస్టింగ్ వేయిస్తానంటున్న అల్లూరి జిల్లా పోలీస్ అధికారి

- ఆయన గాజువాక ట్రాఫిక్ సీఐగా వస్తారట...
- జోన్-2లో తాను చెప్పిన వారికే పోస్టింగ్ ఇస్తారంటూ ప్రచారం చేసుకుంటున్న వైనం
- ఎక్కడ పోస్టింగ్ కావాలో కోరుకోవాలంటూ తన బ్యాచ్‌కు చెందిన వారికి ఆఫర్
- ప్రస్తుతం ఆయా పోస్టులో ఉన్నవారికి కూడా ఫోన్లు...రెండో ఆప్షన్ ఎంచుకోవాలని హుకుం
- నగర పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారిన సదరు సీఐ వ్యవహారశైలి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆయన ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్నారు. కానీ నగర పోలీస్ కమిషనరేట్‌లోని జోన్-2 పరిధిలో సీఐ, ఎస్ఐల పోస్టింగ్‌లు తన కనుసన్నల్లోనే జరుగుతాయంటూ ప్రచారం చేసుకుంటున్నారు. జోన్-2లో ఒక అధికారి తనకు బాగా సన్నిహితులని, తాను చెప్పిన వారికే పోస్టింగ్‌లు ఇస్తారు కాబట్టి ఎక్కడ కావాలో చెప్పాలంటూ తన బ్యాచ్‌కు చెందిన సీఐలు, ఎస్ఐలకు ఆఫర్ చేయడంతోపాటు ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న వారిని వేరొకచోటు ఎంపిక చేసుకోవాలని చెప్పడం... పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

నగర పోలీస్ కమిషనరేట్‌లో పోస్టింగ్ కోసం విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఆశావహులు పోలీస్ శాఖలోని ఉన్నతాధికారులతోపాటు ప్రజా ప్రతినిధుల సిఫారసుల కోసం యత్నిస్తుంటారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇంతవరకూ సీఐలు, ఎస్ఐల బదిలీలు జరగలేదు. గత ప్రభుత్వ హయాంలో ఎవరు ఎక్కడ ఉన్నారో...ఇప్పటికీ అక్కడే కొనసాగుతున్నారు. తాజాగా నగరంలో సీఐలు, ఎస్ఐల బదిలీలు భారీగా జరిగే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న ఒక సీఐ నగరంలో తాను పోస్టింగ్‌లు వేయిస్తానంటూ తన బ్యాచ్‌కు చెందిన సీఐలు, ఎస్ఐలకు హామీ ఇస్తున్నట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం జోన్-2 పరిధిలో పనిచేస్తున్న అధికారి ఒకరు తనకు బాగా సన్నిహితులని తాను చెప్పిన సిఫారసులను ఆయన పరిగణనలోకి తీసుకుంటారని చెప్పుకుంటున్నట్టు పోలీస్ అధికారులు కొందరు తెలిపారు. జోన్-2 పరిధిలో ఎక్కడ పోస్టింగ్ కావాలంటూ తన బ్యాచ్‌కు చెందిన సీఐలు, ఎస్ఐలను అడుగుతున్నారని, వారు అడిగినచోట పనిచేస్తున్న సీఐలు, ఎస్ఐలకు కూడా ఫోన్ చేసి 'మా మనిషి అక్కడికి వస్తాడు కాబట్టి, మీరు మరొక చోటు ఏదైనా ఎంపిక చేసుకుని ఆప్షన్ ఇవ్వండి' అని చెబుతున్నారని పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు. తాను గాజువాక ట్రాఫిక్ సీఐగా వస్తానని, జోన్-2లోని అన్ని స్టేషన్ల సీఐలు, కీలక పోస్టుల్లో తన బ్యాచ్‌వారే ఉంటారని అంటున్నట్టు తెలిసింది. అధికారులు, సిబ్బంది పని తీరుపై సీపీ శంఖబ్రతబాగ్చి నిఘా పెట్టడంతోపాటు, ఎవరైనా ఓవరాక్షన్ చేసినా, అవినీతికి పాల్పడినా తక్షణం చర్యలు తీసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో కూడా ఒక సీఐ స్థాయి అధికారి నగరంలో పోస్టింగ్‌లంటూ హడావుడి చేస్తుండడం పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సదరు సీఐ వ్యవహారం ఇప్పటికే సీపీ దృష్టికి చేరినట్టు కొందరు అధికారులు చెబుతున్నారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రస్తుతం బదిలీలు ఉండకపోవచ్చునని పోలీస్ అధికారులు చెబుతున్నారు.

మ్యూజియం నిర్మాణ పనులు వేగవంతం

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- బెన్నవరం వంతెన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు

చింతపల్లి, జూలై 31: స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. చింతపల్లి మండలం తాజంగి వద్ద రూ.35 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మ్యూజియం పనులను బుధవారం ఆయన పరిశీలించారు. మ్యూజియం నిర్మాణ విధానాన్ని అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ 15 రోజులకు ఏ మేరకు పనులు పూర్తి చేస్తారో షెడ్యూల్ రూపొందించుకుని ఆ విధంగా పనులు పురోగతి సాధించాలని ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశించిన సమయం మేరకు పనులను పూర్తి చేయాలన్నారు. మ్యూజియం నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఇంజనీర్లను ఆదేశించారు. అంతకు ముందు బెన్నవరం వంతెనను పరిశీలించారు. వంతెన నిర్మాణానికి ఏఐబీ గ్రాంట్ కింద రూ.రెండు కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా వంతెన నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట ఐటీడీఏ పీవో అభిషేక్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఈటీ చాణిక్యరావు, ఏఈ యాదకిశోర్, చింతపల్లి తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు ఉన్నారు.



మ్యూజియం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్

ఈదురుగాలులతో భారీ వర్షం

పాడేరురూరల్, జూలై 31: పాడేరులో బుధవారం ఉదయం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు మండల కేంద్రం పరిసరాల్లో అక్కడక్కడ చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. ప్రధాన రహదారులు చిత్తడిగా మారడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

హుకుంపేటలో..

హుకుంపేట: మండలంలో బుధవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఉదయం 10 గంటల వరకు వర్షం పడడంతో జనజీవనానికి ఆటంకం కలిగింది. రహదారులు చిత్తడిగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.



పాడేరులో వర్షం

క్రైం... crime news

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, జూలై 31: పట్టణంలోని వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర ఆలయ సమీపంలో బుధవారం విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. కూండ్రం గ్రామానికి చెందిన గనిశెట్టి రాజబాబు (53) ఆలయ సమీపంలో సిమెంట్ పనులు చేస్తుండగా, విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం అతనిని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి అన్న అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతి

» పాములపుట్ట సమీపంలో మృతదేహం లభ్యం

హుకుంపేట, జూలై 31: పామురాయిగెడ్డలో ఇటీవల గల్లంతైన యువకుడు మృతి చెందాడు. ఒడిశా సరిహద్దులో బుధవారం అతని మృతదేహం లభ్యమైంది. డుంబ్రిగుడ మండలం గుంటసీమ పంచాయతీ కేంద్రానికి చెందిన కిల్లో సోమనాథ్ (18) ఇసుక తవ్వకాల కోసం హుకుంపేట మండలంలోని పామురాయిగెడ్డలు దిగాడు. తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో గెడ్డ ప్రవాహానికి సోమనాథ్ గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు హుకుంపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో నాలుగు రోజులుగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఒడిశా సరిహద్దులోని పాములపుట్టు గ్రామ సమీపంలో గెడ్డ వద్ద సోమనాథ్ మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ సతీష్ తెలిపారు. కాగా, సోమనాథ్ మృతితో తల్లిదండ్రులు, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

ఎలమంచిలి, జూలై 31 : మండలంలోని పురుషోత్తపురం జంక్షన్ సమీపం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఇందుకు సంబంధించి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివి. అనకాపల్లి మండలం బవులువాడ పంచాయతీ ఆర్‌వీఎస్ నగర్‌కు చెందిన జీ.ప్రకాశమ్మ(73) పురుషోత్తపురం జంక్షన్ వద్ద బుధవారం తెల్లవారుజామున నడిచి వెళుతుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలకు గురైన ఆమెను స్థానికులు ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి


మృతి చెందిన దేవి

డుంబ్రిగుడ, జూలై 31: మండలంలోని పోతంగి పంచాయతీ బల్లుగుడ గ్రామంలో ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. అరమ గ్రామానికి చెందిన బంగురు దేవి (29)కి పోతంగి పంచాయతీ బల్లుగుడ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌తో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తల మధ్య చిన్న చిన్న గొడవలు జరుగుతున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రుల ఇంటిలో ఉంటున్న దేవి, బుధవారం మధ్యాహ్నం బల్లుగుడ గ్రామంలోని తన భర్త ఇంటికి బయలుదేరింది. డుంబ్రిగుడలో దిగి బల్లుగుడ వెళ్తుండగా మార్గమధ్యంలోని పొదాల వద్ద ఆమె అపస్మారక స్థితిలో పడిపోయింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు డుంబ్రిగుడ పీహెచ్‌సీకి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫీడర్ అంబులెన్స్ సిబ్బంది వెంటనే దేవిని పీహెచ్‌సీకి తరలించారు. చికిత్స ప్రారంభించినప్పటికే దేవి మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆసుపత్రికి చేరుకుని, మృతదేహాన్ని అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 13 మందికి జరిమానాలు


వాహనచోదకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ పైడపునాయుడు

అనకాపల్లి టౌన్, జూలై 31 : మద్యం సేవించి వాహనాలు నడిపిన పదమూడు మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ 13వ ఎంఎం కోర్టు న్యాయమూర్తి బి.వి.వి జయలక్ష్మి బుధవారం తీర్పు చెప్పినట్టు అనకాపల్లి ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఆ సమయంలో పదమూడు మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. వీరిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారన్నారు. ఇదిలావుంటే, ద్విచక్ర వాహనచోదకులకు ట్రాఫిక్ సీఐ పైడపునాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే అనర్థాలను కళ్లకు కట్టినట్టు వివరించారు.

స్టాండింగ్ కమిటీ నామినేషన్లన్నీ ఓకె

» ముగిసిన పరిశీలన

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్టాండింగ్ కమిటీ ఎన్నికకు సంబంధించి దాఖలైన 20 నామినేషన్లు సక్రమంగా ఉన్నందున వాటన్నింటినీ ఆమోదించినట్టు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఇండిపెండెంట్ కార్పొరేటర్ సహా టీడీపీ నుంచి పది మంది, వైసీపీ నుంచి పది మంది నామినేషన్లు వేశారు. మంగళవారంతో నామినేషన్ల దాఖలుకు గడువు ముగియడంతో బుధవారం వాటిని అధికారులు పరిశీలించారు. నిబంధనలు ప్రకారం నామినేషన్ పత్రాలు ఉండడంతో వాటన్నింటినీ అనుమతిస్తున్నట్టు కమిషనర్ వివరించారు. నామినేషన్లను ఎవరైనా ఉపసంహరించుకోవాలనుకుంటే ఆగస్టు నెల మూడో తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ గడువు ఉందన్నారు. ఏడున ఎన్నిక, అదేరోజు ఫలితాల ప్రకటన ఉంటుందన్నారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

ద్వారకాబస్‌స్టేషన్, జూలై 31: వివిధ ట్రేడుల్లో ఐటీఐ పాసైన విద్యార్థులు ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని జోనల్‌స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ బి.సుధాబిందు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.అప్రెంటిస్‌షిప్ఇండియా.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 16లోగా తమ పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. జిల్లాలవారీగా ఉన్న ఖాళీలను ప్రకటించారు. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాలకు డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ ట్రేడులు, విశాఖ జిల్లాకు డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, విజయనగరం జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్ మెటల్ వర్కర్, పెయింటర్, మెషినిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడులకు ఖాళీలు ఉన్నాయన్నారు. విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాల వారు ఈనెల 22న, కోనసీమ, విజయనగరం జిల్లాల అభ్యర్థులు 23న, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ జిల్లాల అభ్యర్థులు 24న, తూర్పుగోదావరి, శ్రీకాకుళం జిల్లాల అభ్యర్థులు 27న విజయనగరం వీటీ అగ్రహారంలోని ఆర్టీసీ జోనల్‌స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 08922-294906 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	82.00
లైవ్ ధర	102.00
విత్ స్కిన్	174.00
స్కిన్ లెస్	184.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

» గంజాయి రవాణా కట్టడికి ప్రత్యేక నిఘా
» బాలికలు, మహిళలపై నేరాలు జరగకుండా అనుక్షణం అప్రమత్తం
» పోలీసు అధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ దీపిక ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ దీపిక

తుమ్మపాల, జూలై 31: జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ ఎం. దీపిక ఆదేశించారు. అనకాపల్లిలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం నెలవారీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న సాధారణ, ముఖ్యమైన, తీవ్రతరమైన కేసుల వివరాలు, గంజాయి, మిస్సింగ్ కేసుల వివరాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి రవాణా జరిగే ఆంధ్రా, ఒడిశా సరిహద్దు జిల్లాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏజెన్సీ ప్రాంతం వైపు వివిధ మార్గాల్లో రవాణా జరిగే గంజాయిని గుర్తించడంతో పాటు ఇంటిలిజెన్సీ సమాచార సేకరణ, ఆకస్మిక డైనమిక్ వాహన తనిఖీలను నిర్వహించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా కేసుల్లో తప్పించుకొని తిరుగుతున్న నిందితులను అరెస్టు చేయాలన్నారు. గంజాయి రవాణా కేసుల్లో పోలీస్ సిబ్బంది పాత్ర ఉన్నట్లు విచారణలో వెల్లడైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలికలు, మహిళలపై జరిగే నేరాల పట్ల పోలీస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నేరాలను నియంత్రించేందుకు పగలు, రాత్రి గస్తీలను ముమ్మరం చేయాలన్నారు. బ్యాంక్‌లు, ఏటీఎంల దగ్గర ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. పాత నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. సైబర్ క్రైమ్, నేరాల నియంత్రణకు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా నేర నియంత్రణలో ప్రతిభ చూపిన 15 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్‌లో పదోన్నతులు, బదిలీలు

» విశాఖ సర్కిల్ ఎస్ఈగా జి.శ్యామ్‌బాబు
» రాజమండ్రి ఎస్ఈగా గొర్లె ప్రసాద్

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)లో పలువురికి బుధవారం పదోన్నతులు కల్పించారు. మరికొందరిని బదిలీ చేశారు. ఈపీడీసీఎల్ పరిధి శ్రీకాకుళం జిల్లా నుంచి ఏలూరు వరకు ఉండడంతో అన్నింటినీ దృష్టిలో ఉంచుకొని సీఎండీ పృథ్వీతేజ్ ఈ బదిలీలు చేశారు. విశాఖపట్నం కార్పొరేట్ ఆఫీసులో జీఎం (ఆపరేషన్స్-2)గా పనిచేస్తున్న జి.శ్యాంబాబును విశాఖ సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈగా నియమించారు. విశాఖ ఎస్ఈగా పనిచేస్తున్న ఎల్.మహేంద్రనాథ్‌ను కార్పొరేట్ ఆఫీసులో క్వాలిటీ కంట్రోల్ జీఎంగా బదిలీ చేశారు. కాకినాడలో ఆపరేషన్స్ ఈఈగా పనిచేస్తున్న గొర్లె ప్రసాద్‌కు పదోన్నతి కల్పించి రాజమహేంద్రవరం ఆపరేషన్స్ ఎస్ఈగా నియమించారు. అక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న టీవీఎస్ఎన్ మూర్తికి పదోన్నతి కల్పించి కార్పొరేట్ కార్యాలయంలో ప్రాజెక్ట్ సీజీఎంగా వేశారు. విశాఖలో ప్రాజెక్ట్ జీఎంగా ఉన్న బి.అశోక్‌కుమార్‌కు సీజీఎంగా పదోన్నతి ఇచ్చి కార్పొరేటర్ కార్యాలయంలో వేశారు. పలాసలో ఆపరేషన్స్ ఈఈగా పనిచేస్తున్న గొప్పు ప్రసాద్‌కు పదోన్నతి కల్పించి విశాఖ కార్పొరేట్ ఆఫీసులో ఆపరేషన్స్ జీఎంగా నియమించారు. తాడేపల్లిగూడెంలో ఈఈగా పనిచేస్తున్న ఎ.రఘునాథబాబుకు పదోన్నతి ఇచ్చి కార్పొరేట్ ఆఫీసులో ప్రాజెక్ట్ జీఎంగా వేశారు. పార్వతీపురంలోని ఈఈ వెంకటేశ్వరరావును కార్పొరేట్ కార్యాలయంలో ఎనర్జీ ఆడిట్‌కు, కార్పొరేట్ కార్యాలయంలో ఈఈ సురేశ్‌కుమార్‌ను శ్రీకాకుళం టెక్నికల్ ఈఈగా, రాజమహేంద్రవరం ఈఈ ఉదయ భాస్కర్‌ను కాకినాడ ఆపరేషన్స్ ఈఈగా, శ్రీకాకుళంలోని ఈఈ ఎ.రాజశేఖర్‌ను రాజమహేంద్రవరం ఈఈగా బదిలీ చేశారు.

అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో డిప్యూటీ ఈఈ బి.రఘుకు పదోన్నతి కల్పించి తాడేపల్లిగూడెం వేశారు. విజయనగరం డిప్యూటీ ఈఈ పి.మురళీకృష్ణకు పదోన్నతి కల్పించి కార్పొరేట్ కార్యాలయంలో పర్చేజెస్ ఈఈగా బదిలీ చేశారు. శ్రీకాకుళంలోని డిప్యూటీ ఈఈ పి.యోగీశ్వరరావుకు పదోన్నతి ఇచ్చి ఆపరేషన్స్ ఈఈగా పలాస బదిలీ చేశారు. సింహాచలంలోని డిప్యూటీ ఈఈ కె.గోపాలరావునాయుడికి పదోన్నతి కల్పించి పార్వతీపురం ఆపరేషన్స్ ఈఈగా బదిలీ చేశారు. వీరు కాకుండా మరికొందరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు అసిస్టెంట్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించి బదిలీలు చేశారు.

క్లాత్ బ్యాగులనే వినియోగించాలి


» శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు


క్లాత్ బ్యాగులను ప్రదర్శిస్తున్న సభాపతి అయ్యన్నపాత్రుడు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ తదితరులు

నర్సీపట్నం, జూలై 31: ఎల్లప్పుడూ క్లాత్ సంచులు మాత్రమే వినియోగించాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. వాకర్స్ క్లబ్ దశాబ్ది వేడుకల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ చేతుల మీదుగా నిర్వాహకులు నార సంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న మాట్లాడుతూ ప్రజలు పాలిథిన్ సంచులు వాడి విచ్చవిడిగా వాడి రోడ్డు మీద పడేస్తున్నారని, ఆ వ్యర్థాలు భూమిలో కలవకపోవడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార వ్యర్థాలతో పాలిథిన్ కవర్లను రోడ్డు మీద పడేయడంతో వాటిని పశువులు తిని ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయన్నారు. మానవ తప్పిదాలకు మూగ జీవాలు బలికావడం అమానుషం అన్నారు. ప్లాస్టిక్ సంచులు వాడకుండా నార, వస్త్ర సంచులు వాడాలని పిలుపునిచ్చారు. వాకర్స్ క్లబ్ చేపడుతున్న ప్లాసిక్ నిషేధానికి అందరూ సహకరించాలన్నారు. సభాపతి అయ్యన్నపాత్రుడు భార్య పద్మావతి మాట్లాడుతూ 26వ వార్డులో ప్లాస్టిక్ నిషేధం, మొక్కలు నాటే కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కుప్పిలి స్వామి, జాయిట్ సెక్రటరీలు పి.శ్రీను, వాకాడ శంకర్‌రెడ్డి, కోశాధికారి అల్లు అప్పారావు, పూర్వపు అధ్యక్షుడు అడిగర్ల వరహాలనాయుడు, కార్యదర్శి ఎంఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

సెప్టెంబరు నుంచి పశుగణన

» మొత్తం 16 రకాల వివరాలు సేకరణ
» పశు సంవర్ధక శాఖ సీఎస్ నాయక్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎస్, తదితరులు


మాట్లాడుతున్న నాయక్

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి డిసెంబరు వరకు పశుగణన ప్రారంభమవుతుందని రాష్ట్ర పశు సంవర్థక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని గ్రీన్‌పార్కు హోటల్‌లో పశుగణనపై ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రాంతీయ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐదేళ్లకొకసారి ఈ పశుగణన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మొత్తం 16 రకాల జంతువుల వివరాలు ఇంటింటికీ వెళ్లి సేకరించాలన్నారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, గుర్రాలు, గాడిదలు, ఒంటెలు, జడల బర్రెలు, నాటు పందులు, సీమపందులు, పౌల్ట్రీ కోళ్లు, నాటు కోళ్లు, టర్కీ కోళ్లు, కుక్కలు తదితర వాటి వివరాలు నమోదుకు ప్రత్యేకించి యాప్ రూపొందించామన్నారు. పూర్తిస్థాయి డిజిటలైజేషన్ ప్రక్రియలో గణన చేయాలని సూచించారు. కోళ్ల ఉత్పత్తిలో ఏపీ దేశంలో రెండో స్థానంలో, మేకలు/గొర్రెల ఉత్పత్తిలో నాలుగు, పాల ఉత్పత్తిలో ఐదో స్థానంలో ఉందన్నారు. 2019లో చేపట్టిన గణన మేరకు రాష్ట్రంలో 46,00,087 ఆవులు, 62,19,499 గేదెలు, 1,76,26,971 గొర్రెలు, 55,22,133 మేకలు, 91,958 పందులు, 10,78,63,152 కోళ్లు ఉన్నాయన్నారు. దేశ స్థూల ఉత్పత్తికి 1,40,979 కోట్ల ఆదాయం ఈ రంగం నుంచి వస్తున్నదన్నారు. అన్ని జాగ్రత్తలు తీసుకుని డిసెంబరు నెలాఖరుకు పశుగణన పూర్తిచేయాలన్నారు. ఇంటింటి నుంచి సేకరించిన సమాచారాన్ని మదించి వచ్చే ఏడాది మార్చి/ఏప్రిల్‌లో పశుగణన వివరాలను కేంద్ర ప్రభుత్వం వెల్లడిస్తుందన్నారు. పశు సంవర్థక శాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ ఆర్.అమరేంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 42 లక్షల కుటుంబాలు ఈ రంగంలో ఉన్నాయన్నారు. కేంద్ర పశు సంవర్థకశాఖ గణాంకాల విభాగం సలహాదారు జగత్ జకారియా మాట్లాడుతూ గణనలో కచ్చితత్వం పాటించాలన్నారు. భారత పశుసంవర్థక, పాడి పరిశ్రమ శాఖ డైరెక్టర్ వీపీ సింగ్ మాట్లాడుతూ పశుగణన కోసం నూతన సాంకేతిక పరిజ్ఞానంతో యాప్ రూపొందించామన్నారు. ఢిల్లీ నుంచి భారత ప్రభుత్వ పశుసంవర్థక శాఖ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయ వర్చువల్‌గా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పశు సంవర్థక రంగం ద్వారా వస్తున్న ఆదాయంలో భారత్ వాటా 11 శాతంగా ఉందన్నారు. ప్రాంతీయ సదస్సులో రాష్ట్ర పశు సంవర్థక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎండ సింహాచలం, విశాఖ జిల్లా పశు సంవర్థక అధికారి డాక్టర్ కె.రామకృష్ణ, పలువురు అధికారులు, మూడు రాష్ట్రాల నుంచి నోడల్ అధికారులు పాల్గొన్నారు.

రూ. 2 కోట్ల టర్నోవర్‌కు చోడవరం మహిళా సంఘం

» మేనేజర్ లక్ష్మి


మహాజన సభలో మహిళా సంఘం కార్యవర్గ సభ్యులు

చోడవరం, జూలై 31 : వ్యాపారం ప్రారంభించిన తక్కువ సమయంలోనే తమ సంఘం రూ.రెండు కోట్ల లావాదేవీలకు చేరడం ఆనందంగా ఉందని స్థానిక చోడవరం మహిళా పొదుపు సంఘం మేనేజర్ సిరసపల్లి లక్ష్మి అన్నారు. బుధవారం కో- ఆపరేటివ్ కాలనీలోని సంఘ భవనంలో సంఘం మూడో మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ పొదుపు సంఘం ప్రారంభించిన మూడేళ్లలోనే ఈ స్థాయిలో వ్యాపారం పెరగడం సంఘంపై మహిళలకు ఉన్న నమ్మకం వల్లే సాధ్యమైందన్నారు.వదవవల సంఘం కార్యకలాపాలను మరింత విస్తరించన్నట్టు చెప్పారు. వచ్చే ఏడాదికి పదివేల మంది సభ్యుల నమోదుతో పాటు, టర్నోవర్‌ను రూ.5 కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు. సంఘానికి సొంతంగా భవన నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సంఘం కొత్త కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. నూతన అధ్యక్షురాలిగా పుల్లేటి వరహాలమ్మను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొందరు సభ్యులకు బీమా పరిహారం చెక్కులు పంపిణీ చేశారు.

ఉపాధి కల్పనకు 'సింహాద్రి' కృషి



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, జూలై 31 : నిర్వాసిత గ్రామాల యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా సింహాద్రి ఎన్టీపీసీ పనిచేస్తుందని సంస్థ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా తెలిపారు. సింహాద్రి సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా విజయవాడకు చెందిన సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపీఈటీ) ద్వారా యువతకు నిర్వహించిన శిక్షణ శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణకు హాజరైన వారికి సీజీఎం బుధవారం సర్టిఫికెట్లను పంపిణీ చేసి మాట్లాడారు. ఇటువంటి శిక్షణ శిబిరాలను యువత సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ హెచ్‌ఆర్ హెడ్ టీబీ పాత్ర, సీఎస్‌ఆర్ మేనేజర్ కె.ప్రకాశరావు, సీపీఈటీ హెడ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెరటి సాగుగా డ్రాగన్ ఫ్రూట్


వడ్డాది-కొత్తూరులో ఇంటి శ్లాబ్‌పై పెంచుతున్న డ్రాగన్ ఫ్రూట్

బుచ్చెయ్యపేట, జూలై 31: వడ్డాది-కొత్తూరుకు చెందిన ఎలిసెట్టి ఈశ్వరరావు తన ఇంటి పై కప్పుపై డ్రాగన్ ఫ్రూట్స్ పెంచుతున్నారు. ఒకప్పుడు ఇతర దేశాల నుంచి దిగుమతి అయ్యే ఈ డ్రాగన్ ఫ్రూట్‌ను మండలంలో సాగు చేపట్టారు. అధిక పోషకాలు, రోగ నిరోధక శక్తిని పెంపొందించే ఈ ఫ్రూట్‌కు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. వ్యవసాయ భూములోనే కాకుండా పెరట్లో, ఇంటి శ్లాబ్‌లపై కూడా డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసే వీలుంటుంది. ఈశ్వరరావు ఇంటి పై కప్పుపై ప్లాస్టిక్ తొట్టెలో పెంచిన మొక్కకు ఇప్పటికే 10 డ్రాగన్ ఫ్రూట్స్ పక్వానికి వచ్చాయి. మరో పది ఫ్రూట్స్ పక్వానికి రావడానికి సిద్ధంగా ఉన్నాయి. మార్కెట్లో ఒక్కో ఫ్రూట్ రూ.50 నుంచి 100ల వరకు ధర పలుకుతోంది. 30 సంవత్సరాల పాటు కాపు కాసే డ్రాగన్ ఫ్రూట్స్ పెరటి సాగుగా చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని ఈశ్వరరావు తెలిపారు.

నేడు కోనాం జలాశయం నుంచి సాగునీరు విడుదల


కోనాం జలాశయంలో కళకళలాడుతున్న సాగునీరు

చీడికాడ, జూలై 31: మండలంలోని కోనాం పాలవెల్లి జలాశయం నుంచి ఖరీఫ్ సీజన్‌కు వరినాట్లు వేసు కునేందుకు ఆగస్టు 1న సాగునీరు విడుదల చేయనున్నట్టు జల వనరుల శాఖ ఏఈఈ సీహెచ్ జయరాం పడాల్ తెలిపారు. జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 99.40 మీటర్లకు చేరుకుందన్నారు. ఇన్‌ఫ్లో 30 క్యూసెక్కులు కాగా, ఔట్‌ఫ్లో 150 క్యూసెక్కుల వరకూ సాగునీరు వృథాగా పోతోందని తెలిపారు. ఈ కార్యక్రమానికి గురువారం ఉదయం 10 గంటలకు నీటిపారుదలశాఖ డీఈఈ చింతల వేణుగోపాలనాయుడు, సాగునీటి సంఘాల రైతులు, నాయకులు హాజరు కానున్నారన్నారు.

పురోహిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా 'పెద్దింటి'


జిల్లా అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకుంటున్న సూర్యనారాయణమూర్తి

ఎలమంచిలి, జూలై 31: అనకాపల్లి జిల్లా పురోహిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా ఎలమంచిలికి చెందిన పెద్దింటి సూర్యనారాయణ మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నం శిల్పారామంలో బుధవారం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు పెద్దింటి ఇక్కడి విలేకరులకు తెలిపారు. సమాఖ్య రాష్ట్ర ప్రతినిధులు చేతుల మీదుగా జిల్లా అధ్యక్షుడిగా తాను నియామక పత్రాన్ని అందుకున్నట్టు వివరించారు. బ్రాహ్మణ పురోహిత సమాఖ్య అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

కోడ్ ఉండగానే బదిలీలు

» పోలీస్ శాఖలో డీఎస్పీల బదిలీ నిలిపివేత
» ఈపీడీసీఎల్‌లో మాత్రం ఎస్ఈలు, డీఈల బదిలీలు
» జీవీఎంసీలో కూడా...

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి మంగళవారం షెడ్యూల్ ప్రకటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రకటన జారీచేస్తూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్టు వివరించారు. ఇదిలావుండగా పోలీస్ శాఖలో డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. అందులో ఎక్కడా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు సంబంధించిన బదిలీలు లేవు. నియామకాలు లేవు. కానీ ఏపీఈపీడీసీఎల్‌లో బుధవారం భారీగా బదిలీలు చేపట్టారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు బదిలీలు చేశారు. విశాఖ సర్కిల్ ఎస్ఈగా శ్యాంబాబును నియమించగా, ఆయన రాత్రి ఏడు గంటలకు బాధ్యతలు స్వీకరించారు. అలాగే జీవీఎంసీలో అదనపు కమిషనర్‌గా డీవీ రమణమూర్తిని నియమించారు. ఆయన సాంఘిక సంక్షేమ శాఖ నుంచి వచ్చారు. డిప్యుటేషన్‌పై గాజువాకలో పనిచేస్తున్న అదనపు కమిషనర్ వి.సన్యాసిరావును మాతృశాఖకు పంపించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా కొందరు బదిలీలను ఆపగా, మరికొందరు బదిలీలు చేపట్టారు. దీనిపై అధికార వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. దీనిపై కలెక్టర్ కార్యాలయంలో సంప్రతించగా, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందిని బదిలీ చేయకూడదని, ఇతర శాఖలకు ఇది వర్తించదని ఒక అధికారి తెలిపారు.

అయితే ఎన్నికల కోడ్ అంటే అన్ని శాఖలకు వర్తిస్తుందని, మినహాయింపు ఏమీ ఉండదని మరో అధికారి వ్యాఖ్యానించారు. దీనిపై ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టరే స్పష్టత ఇవ్వాల్సి ఉంది.


జైపూర్ జంక్షన్‌లో వాహనాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

పోలీసుల ముమ్మర తనిఖీలు

మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తం

అరకులోయ, జూలై 31: మావోయిస్టుల వారోత్సవాలు జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అదనపు బలగాలతో ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. అరకులోయ పోలీస్ సర్కిల్ పరిధిలోని అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల పరిధిలో విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేస్తున్నట్టు అరకులోయ ఎస్‌ఐ ఆర్.సంతోశ్‌కుమార్ తెలిపారు. సీఐ రుద్రశేఖర్ ఆధ్వర్యంలో కల్వర్టులు, అనుమానిత ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో బుధవారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు.

పెదబయలులో..

పెదబయలు: స్థానిక ఏవోబీ వంతెన వద్ద, పన్నేడా జంక్షన్, రోగులపేట జంక్షన్లలో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనాల రికార్డులను పరిశీలించి ప్రయాణికుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

పాడేరు రూరల్, జూలై 31: పాడేరు డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీఎస్ఎం.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ మరమ్మతులు కోసం వివిధ మండలాల్లోని సబ్ స్టేషన్ల పరిధిలో కొన్ని గ్రామాలకు మాత్రమే విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. పాడేరు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ జి.ముంచంగిపుట్ట ఫీడర్‌లోని జల్లిపల్లి, పాతరపుట్టు, దుమ్మాపుట్టు, కొత్తపల్లిగ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అదే విధంగా చింతపల్లి మండలం లంబసింగి సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ తాజంగి ఫీడర్‌లోని అంజలి శనివారం, రాయుమానుపాకలు, గాజులపాలెం, జలగలగెడ్డ గ్రామాల్లో, కొయ్యూరు మండలం కాకరపాడు సబ్ స్టేషన్‌లోని సొలబు, పిట్టలాచలం, నడింపాలెం, గింజర్తిలో, పెదబయలు మండలం 11 కేవీ రూరల్ ఫీడర్‌లోని పెదబయలు, సీతగుంట, రోగులపేట, చట్రాయిపుట్టులో, అరకు మండలం 11కేవీ హట్టగూడ రూరల్ ఫీడర్‌లోని గన్నెల, పెదలబుడు, లోతేరు, గరదగూడలో, అనంతగిరి మండలంలోని అనంతగిరి, దిగువశోభ, భీసుపురం, భర్గల గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

వంట కార్మికుల నియామకాలకు నివేదిక

గిరిజన సంక్షేమ విద్యా శాఖ డీడీ కొండలరావు


విద్యార్థినులకు భోజనాలు వడ్డిస్తున్న డీడీ కొండలరావు

డుంబ్రిగుడ, జూలై 31: జిల్లా వ్యాప్తంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని వంట కార్మికుల నియమకాలను ప్రభుత్వానికి నివేదికను అందించడం జరిగిందని గిరిజన సంక్షేమ విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు చెప్పారు. మండలంలోని కించుమండ, జాముగుడ గిరిజన ఆశ్రమ పాఠశాలలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కించుమండలో ఉచిత క్యాన్సర్ ప్రాథమిక పరీక్షల శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలను చేయించుకున్నారు. అనంతరం జాముగుడ ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సందర్శించిన ఆయన మధ్యాహ్న భోజన మెనూను పరిశీలించారు. భోజన మెనూపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు భోజనాలను వడ్డించారు. కూటమి ప్రభుత్వం మార్పు చేసిన వివరాలను గోడపై పొందుపరచాలని నిర్వాహకులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వయనాడ్, నాడు కోడిపుంజువలస..

... 5వ పేజీ తరువాయి

కల్పించింది. మృతుల కుటుంబానికి రూ.2.5 లక్షల చొప్పున పరిహారం అందజేసింది. ప్రతి కుటుంబానికి జీవనోపాధి కోసం జత దుక్కిటెద్దు, నివాసం కోసం మోడల్ కాలనీని మంజూరుచేశారు. స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి సహాయాన్ని అందించాయి. అదే తరహాలో 2014 అక్టోబరు 8వ తేదీన హుద్‌హుద్ తుఫాన్ వల్ల మాదల పంచాయతీ మేదరశాల గ్రామంపై కొండచరియలు విరిగిపడి ఆరుగురు సజీవ సమాధి అయ్యారు. వరద వల్ల మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొండలను ఆనుకుని చాలా గ్రామాలు ఉన్నాయి. కోడిపుంజువలస ఘటన అనంతరం వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పాలకులు భావించినా చాలామంది సుముఖత చూపలేదు. వయనాడ్ ఉదంతం నేపథ్యంలో జిల్లా అధికారులు కొండవాలు గ్రామాల్లో ఉంటున్న వారి రక్షణపై దృష్టి పెట్టాల్సి ఉంది.

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేయడంతో ఉమ్మడి జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి కోడ్ అమలులోకి వచ్చింది.

కలెక్టర్ల సదస్సుకు హాజరుపై ఈసీకి కలెక్టర్ లేఖ

ఆగస్టు ఐదో తేదీన రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ల సదస్సు నిర్వహించనున్నది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కలెక్టర్ల సదస్సుకు హాజరుకావాలా? లేదా?...అన్న దానిపై స్పష్టత కోసం ఎన్నికల కమిషన్‌కు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ లేఖ రాయనున్నారు. కలెక్టర్ల సదస్సులో జిల్లాల ప్రగతి, భవిష్యత్తులో చేపట్టాల్సిన అంశాలపై నివేదికలు రూపొందించి చర్చిస్తారు. ఎన్నికల కమిషనర్ నుంచి అనుమతి వస్తే ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు ఈ సదస్సుకు హాజరవుతారు. ఇంకా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం అధికారికంగా నిర్వహిస్తుంటారు. సాధారణంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం స్వీకరిస్తారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దీనిపై కూడా ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలని నిర్ణయించారు.

రహదారిలో తు(తి)ప్పలు

ఎక్కడికక్కడే మలుపులు.. ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పలు.. ఎక్కడా ఏర్పాటుచేయని హెచ్చరిక బోర్డులు.. దగ్గరకొస్తేగాని కానరాని ఎదురెదురు వాహనాలు.. ఆపై ప్రమాదాన్ని తలపిస్తున్న ప్రయాణాలు.. ఇదీ జి.మాడుగుల-మద్దిగరువు ప్రధాన రహదారిలో దుస్థితి. ఫలితంగా వాహన చోదకులు, ప్రయాణికులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు.

- ప్రమాదకరంగా జి.మాడుగుల-మద్దిగరువు రోడ్డు
- దగ్గరకొస్తేగాని కానరాని ఎదురెదురు వాహనాలు
- హెచ్చరిక బోర్డులూ ఏర్పాటుచేయని అధికారులు
- వాహన చోదకులు, ప్రయాణికుల అగచాట్లు


మద్దిగరువు రహదారిలో వాకపల్లి మలుపు వద్ద తుప్పలు


జి.మాడుగుల-మద్దిగరువు ఇరుకు రోడ్డులోని పుసులుమామిడి మలుపు సమీపంలో తుప్పల మధ్యలో వస్తున్న వాహనం


పలుపుమామిడి సమీపంలో ప్రమాదానికి గురైన వాహనాలు

జి.మాడుగుల, జూలై 31:

జి.మాడుగుల-మద్దిగరువు ప్రధాన రహదారి ఈ రహదారి మీదుగా నిత్యం పెద్ద, చిన్న వాహనాలు సైతం రద్దీగా తిరుగుతుంటాయి. అలాగే జి.మాడుగుల మండల కేంద్రం నుంచి మద్దగరువు వరకు పోలీసులు ఆధ్వర్యంలో ఉచిత బస్సును ప్రతీ రోజు మూడు సార్లు ఇరువైపులా తిప్పుతున్నారు. ఈ రహదారికి నుర్మతి మొదలుకొని ఎగరాపల్లి వరకు ప్రమాదకరంగా మలుపులు ఉన్నాయి. దీనికితోడు ఈ మార్గంలో నుర్మతి నుంచి పులుసుమామిడి వరకు ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరిగిపోయాయి. అలాగే రోడ్డు ఇరుకు కావడంతో ఎదురెదురు వాహనాలు దగ్గరికి వస్తేగాని కనిపించడం లేదు.

గత కొంత కాలం నుంచి రహదారికి ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరిగిపోయి ప్రమాదకరంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ప్రమాదకర మలుపులు చేత ఆదమరిచి ప్రయాణిస్తే మూల్యం చెల్లించుకోక తప్పడం లేదు. గత నెల 18వ తేదీన పులుసుమామిడి సమీపంలో జి.మాడుగుల సంతబయలకు చెందిన కారు, భీరం పంచాయతీ గుదలంవీధి గ్రామానికి చెందిన ప్రైవేటు జీపు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. దీంతో ఇద్దరికి స్వల్పంగా గాయాలు తగిలాయి. రహదారిలో తుప్పలు కారణంగానే ఈ ప్రమాదం సంభవించిందని వాహన చోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా ఈ మార్గంలో ప్రయాణమంటేనే ఆందోళన కలిగిస్తున్నదని వారు వాపోయరు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలకు నిలయమైన తుప్పలను తొలిగించాలని వారు కోరుతున్నారు.

నష్టపరిహారానికి నివేదికలు రూపొందించండి

▸▸ జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్... జి.మాడుగులలో విస్తృత పర్యటన


బొంజంగిలో దెబ్బతిన్న కల్వర్టును పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

జి.మాడుగుల, జూలై 31: తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో బాధితులకు నష్టపరిహారం అందించడానికి నివేదికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని వర్షాలకు గండిపడిన కల్వర్టులను బుధవారం పరిశీలించారు. పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌తో కలిసి కుంబిడిసింగి పంచాయతీ అండంగిసింగి, జి.మాడుగుల పంచాయతీ బొంజంగి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కల్వర్టుల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే వర్షాలకు దెబ్బతిన ఇళ్లకు పరిహారానికి నివేదికలు తయారు చేయాలని సూచించారు. రహదారులు, కల్వర్టుల మరమ్మతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం.రాజు, తహసీల్దార్ నరసమ్మ, ఎంపీడీవో లోహిత్‌జయసాగర్, సర్పంచులు కె.రాంబాబు, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లింపిక్స్ క్రీడాకారులు ప్రతిభ చూపాలి: కలెక్టర్

పాడేరు రూరల్: పారిస్ వేదికగా జరుగుతున్న ఒలింపిక్స్‌లో రాష్ట్రం నుంచి పాల్గొంటున్న క్రీడాకారులు మెరుగైన ప్రతిభ చూపాలని, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఒలింపిక్స్ సెల్ఫీ పాయింట్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న క్రీడల్లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం పొందిన క్రీడాకారులు పీవీ.సింధు, ఆర్.సాత్విక్, సాయిరాజ్, వై.జ్యోతి, డి.జ్యోతికశ్రీ, ధీరజ్‌లకు అభినందనలు తెలిపారు. ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో పద్మావతి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎ.జగన్మోహనరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అన్నీ తానై...

వరద సహాయ చర్యల్లో 10 రోజులపైగా చింతూరులోనే అల్లూరి కలెక్టర్ దినేష్

ఎప్పటికపుడు ప్రభుత్వానికి నివేదిస్తూ మండలానికో ఐఏఎస్ ద్వారా సేవలు


వరద ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్, ఎమ్మెల్యే శిరీష

రంపచోడవరం/చింతూరు, జూలై 31: ఒకటి రెండూ కాదు.. ఏకంగా పది రోజులకు పైగానే సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ మూరుమూల ఏజెన్సీ మండలాల్లో ఉండిపోయారు. గోదావరి వరద సహాయక కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొని బాధితులకు బాసటగా నిలిచారు. ఆయనే అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్. గోదావరి పరీవాహక ప్రాంతంలోని నాలుగు విలీన మండలాల్లో వరద ముంచెత్తింది. రెండు వారాలపాటు వరద ముంపుతో ఏజెన్సీ ప్రజలు నానా కష్టాలుపడ్డారు. చింతూరులోనే కలెక్టర్ నివాసం ఉండి వరద సహాయక చర్యల్లో పదిరోజులకుపైగానే పాల్గొన్నారు. ఒకపక్క వరద సహాయ చర్యల్లో పాల్గొంటూనే పాడేరు కేంద్రంగా నిర్వర్తించాల్సిన కలెక్టరు విధులను చింతూరు నుంచే నిర్వర్తిస్తూ ప్రభుత్వాన్ని సంధానపర్చుతూ నిర్వాసితులకు భరోసా కల్పించారు. వరరామచంద్రపురం, కూనవరం, చింతూరు, ఎటపాక మండలాల్లోని 191 ఆవాసాల్లోని 35 వేలమంది వరదల ప్రభావానికి గురయ్యారు. ప్రతి మండలానికి ఒక ఐఏఎస్ అధికారిని, ఒక స్పెషల్ డిప్యూటీ కలెక్టరు చొప్పున నాలుగు మండలాలకు నియమించారు. ప్రతి మండలంలో సాధ్యమైనంతవరకూ ప్రతి వరద ప్రభావిత గ్రామాన్నీ సందర్శించి, అక్కడి నిర్వాసితుల గోడు విన్నారు. ప్రతిరోజూ ప్రభుత్వానికి ఇక్కడి పరిస్థితులను నివేదించడం ద్వారా యంత్రాంగాన్ని అప్రమత్తంచేశారు. సోమవారం ఆయన రూ.15.29 కోట్ల మేర నిధులు అవసరమని సమగ్ర నివేదిక పంపించడంతో ప్రభుత్వం మంగళవారం సాయంత్రం ఉత్తర్వులను జారీచేస్తూ తక్షణ సహాయంగా రూ.10 కోట్లను విడుదల చేసింది. నాలుగు మండలాల్లో వరద సహాయంపై నిర్వాసితుల్లో అసంతృప్తికి తావులేకుండా కలెక్టర్ దినేష్ ఎక్కడికక్కడా ఆయా సమస్యల పరిష్కారం కోసం భరోసా కల్పించారు.

రహదారి నిర్మాణాలు వేగవంతం చేయండి

▸▸ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్


రహదారి నిర్మాణ పనులపై సూచనలు ఇస్తున్న పీవో అభిషేక్

కొయ్యూరు, జూలై 31: రహదారి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డౌనూరు పంచాయతీ పరిధిలోని పాలమామిడి గ్రామాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టికల్ 275(1)లో రూ.8 కోట్ల వ్యయంతో బచ్చింతవయా దారగడ్డ మీదుగా పాలమామిడి గ్రామానికి నిర్మాణాలు చేపడుతున్న రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

అనంతరం పీవో మాట్లాడుతూ త్వరలో తారు (బీటీ) రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని చెప్పారు. పాఠశాల భవనం, తాగునీటి పథకం నిర్మాణాలకు ఇప్పటికే టెండర్లు పిలిచే ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగ ఈఈ డీఆర్ఎం.రాజు, డీఈ చాణిక్య, జేఈ రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వతేజ, సర్పంచులు పాల్గొన్నారు.


గిరిజన రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నంద్

సేంద్రియ పద్ధతిలో సాగుచేసే చిరుధాన్యాలకు గిరాకీ

▸▸ జిల్లా వ్యవసాయాధికారి నంద్

చింతపల్లి, జూలై 31: జిల్లాలో గిరిజన రైతులు సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసే చిరుధాన్యాలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గిరాకీ ఉందని జిల్లా వ్యవసాయాధికారి నంద్ అన్నారు. మండలంలోని పెదబరడలో బుధవారం పర్యటించారు. అక్కడ నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గిరిజన రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుతో బాటు విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి, వాటిని ఎగుమతి చేయడం ద్వారా రైతులకు మంచి లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పరంగా సేంద్రియ సాగు ధ్రువపత్రాల జారీకి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు శాస్త్రీయ విధానాలను ఆచరించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి, డాక్టర్ ఉజ్వలారాణి రైతులకు వివరించారు. అనంతరం చింతపల్లి ఉద్యాన పరిశోధనాస్థానంలో చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల వ్యవసాయాధికారులు, సిబ్బందితో జిల్లా వ్యవసాయాధికారి సమీక్ష నిర్వహించారు. అనంతరం చింతపల్లిలోని అగ్రిల్యాబ్‌ను పరిశీలించారు. విత్తన నమూనాను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎస్ఎఫ్ డీపీవో భాస్కర్, రైతు సాధికారిక సంస్థ ప్రతినిధి దేముళ్లు, టాటా ట్రస్టు ప్రతినిధి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం కృష్ణ సేవలు అభినందనీయం

▸▸ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి


ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చింతపల్లి, జూలై 31: గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు చప్పగెడ్డ కృష్ణ సేవలు చిరస్మరణీయమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి అన్నారు. బుధవారం ఉద్యోగ విరమణ పొందిన వారికి ఉపాధ్యాయులు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ కృష్ణ ఎస్‌జీటీగా, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా 38 సంవత్సరాలు విధులు నిర్వహించారన్నారు. సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయ వృత్తిలోనున్న ఆయన ఆదివాసీ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ఎనలేని కృషిచేశారన్నారు. విద్యార్థులకు ఆయన అందించిన సేవలు మర్చిపోలేమన్నారు. ఈ కార్యక్రమంలో పీజీహెచ్‌ఎం పండన్న, హెచ్‌డబ్ల్యూవో ఉగ్రంగి గణేశ్వరరావు, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బొడు గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో గైనికాలజిస్టు నియామకం


గర్భిణికి తనిఖీలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ

చింతపల్లి, జూలై 31: స్థానిక ఏరియా ఆస్పత్రిలో గైనికాలజిస్టును వైద్య విధాన పరిషత్ అధికారులు నియమించారు. బుధవారం గైనికాలజిస్టు ఎస్.ప్రవీణ విధుల్లో చేరారు. చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో గైనికాలజిస్టులు సుధాశారద ఒక్కరే ఉండడం, ఆమె ప్రస్తుతం సెలవులో వెళ్లడం వల్ల కొన్ని రోజులుగా గర్భిణులకు వైద్య సేవలు నిలిచిపోయాయి. దీంతో గర్భిణుల ఇబ్బందులను వివరిస్తూ 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలపై వైద్య విధాన పరిషత్ అధికారులు, ఐటీడీఏ పీవో అభిషేక్ స్పందించారు. ఈ మేరకు డాక్టర్ ప్రవీణను నియమించారు.

☛ సంక్షిప్తంగా..

కిండంగిలో సిల్వర్‌ఓక్ మొక్కల పంపిణీ

పాడేరు రూరల్, జూలై 31: మండలంలోని కిండంగి పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన సిల్వర్‌ఓక్ మొక్కలను ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ ఎం.శివయ్య బుధవారం పంపిణీ చేశారు. పంచాయతీలోని కిండంగి, సేరుబయలు, నక్కలపుట్టు గ్రామాలకు చెందిన 30 మంది రైతులకు వీటిని అందించారు. మొక్కలను సక్రమంగా పెంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏపీవో వై.వెంకటరమణ, హార్టికల్చర్ సూపర్‌వైజర్ క్రిష్ణమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్ విజయలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్లు కోటేశ్వరరావు, వి.కెజియరాణి, డి.పుట్టి పాల్గొన్నారు.

దామనాపల్లిలో...

గూడెంకొత్తవీధి: మండలంలోని దామనాపల్లిలో రైతులకు బుధవారం సిల్వర్‌ఓక్ మొక్కలను పంపిణీ చేశారు. 170 ఎకరాలకు సంబంధించిన సర్పంచ్ రామకృష్ణ వీటిని అందించారు. ఈ మొక్కల కింద అంతర పంటగా కాఫీ, మిరియాలు వేసుకుంటే అధిక లాభాలను పొందవచ్చని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అలాగే అవకాడో, టేకు మొక్కలను త్వరగా పంపిణీ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్పీలు కుందేరి వివేకనందదొర, సత్తిబాబు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో సమస్యలపై స్పందించాలి

పాడేరు రూరల్, జూలై 31: జిల్లాలోని వసతి గృహాల్లో సమస్యలపై అధికారులు స్పందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈ.కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మెస్, కాస్మోటిక్స్ బిల్లులు విడుదల చేయాలని, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్ల పేరుతో వసూళ్లకు పాల్పడడంతో గిరిజన విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అలాగే అడ్మిషన్ల పేరుతో ఒకేషనల్ గ్రూపు విద్యార్థుల నుంచి రూ.2,400, ఎంపీసీ, బైపీసీ విద్యార్థుల నుంచి రూ.2,009 వసూలు చేయడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని విద్యార్థులకు తిరిగి చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అతని వెంట నాయకులు జాను, రంగారావు, కె.మహేష్, టి.మహేష్ ఉన్నారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

గూడెంకొత్తవీధి, జూలై 31: మండలంలోని దుచ్చరపాలెంలో బుధవారం పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరావు తెలిపారు. భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని ప్రతీ పంచాయతీ పరిధిలోని ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అలాగే గ్రామంలోని మంచినీటి పథకాన్ని పరీక్షించామన్నారు. ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

శామ్యూల్ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

సీలేరు, జూలై 31: విద్యార్థికి శామ్యూల్ కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. జీకే వీధి మండలం సప్పర్ల ఆశ్రమంలో ఎం.బూసుకొండకు చెందిన శామ్యూల్ పదో తరగతి చదువుతూ కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలతో సోమవారం అర్ధ రాత్రి మృతి చెందడంతో బుధవారం పాఠశాలకు వెళ్లి ఆరా తీసినట్టు చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్లు నియమించాలని, తరచూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ఆదివాసీ దినోత్సవం రోజు సెలవు ప్రకటించాలి

చింతపల్లి, జూలై 31: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజును సెలవుగా ప్రకటించాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోచల రామకృష్ణ కోరారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతిపత్రం అందించినట్టు చెప్పారు. అలాగే జీవో నంబర్-3ను యథావిధిగా కొనసాగించేలా చూడాలని, ఉద్యోగ నియామకాల్లో గిరిజన అభ్యర్థులకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరగా, ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. అతని వెంట సంఘం మాజీ మండల అధ్యక్షుడు ఎం.వెంకటరమణ ఉన్నారు.

చిరుధాన్యాల సాగుతో మంచి ఆదాయం

జి.మాడుగుల, జూలై 31: మిల్లెట్ పంటలతో మంచి ఆదాయం పొందవచ్చని వ్యవసాయాధికారి విజయలక్ష్మి చెప్పారు. తాశారుబయలులో మత్స్యదేవత ఎఫ్‌పీవో సీఈవో హనుమంతరావు ఆధ్వర్యంలో బుధవారం పొలంబడి నిర్వహించారు. ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో సుమారు 500 ఎకరాల్లో సాగు చేస్తున్న సామలు, కొర్రలు, రాగులు, జొన్నలు, ఊదలు, మొక్కజొన్న, వేరుశనగ పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో పాత్రుడు, యూనిట్ ఇన్‌చార్జి మహేశ్వరి, సిబ్బంది సతీష్, జీవన్, కొండమ్మ, చంద్రకళ, కృష్ణ, మోహన్‌బాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

హుకుంపేట, జూలై 31: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ కోరారు ఈ మేరకు బుధవారం డీఈవో బ్రహ్మాజీరావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని, నాడు-నేడులో నిలిచిపోయిన నిర్మాణాలను పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరగా, డీఈవో సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలువలో చెత్తాచెదారం తొలగింపు

అనంతగిరి, జూలై 31: మండల కేంద్రంలోని అరకు-విశాఖ ప్రధాన ఆనుకుని ఉన్న కాలువల్లో పారిశుధ్య కార్మికులతో బుధవారం చెత్తాచెదారం తొలగింపు చర్యలు చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడిపడితే అక్కడ చెత్త వెయ్యరాదని కార్యదర్శి బాలకృష్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ మామిడి రవి పాల్గొన్నారు.

మత్స్యగెడ్డపై వంతెన నిర్మించాలి

ముంచంగిపుట్టు, జూలై 31: మండలంలోని సుజనకోట, కుమ్మరిపుట్టు గ్రామాల మధ్య ప్రవహించే మత్స్యగెడ్డపై వంతెన నిర్మించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో బుధవారం ఆ ప్రాంతంలోని గ్రామాలను సందర్శించారు. గెడ్డ పరివాహక ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమ్మరిపుట్టు సమీపంలో మత్స్యగెడ్డపై వంతెన నిర్మాణానికి సర్వేలతో సరిపెట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ చిన్నపాటి అవసరానికైనా గెడ్డ దాటాల్సి వస్తుందని, గెడ్డలో పడి గిరిజనులు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయని ఆయన వాపోయారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.త్రినాథ్, ఎం.ఎం.శ్రీను, గాసీరాం దొర పాల్గొన్నారు.